# సందిగ్ధాకాశం...!

కార్తీకమాసపు, తొలి పక్షపు దినాలు. ఊరికి కొద్ది దూరంలో గల సముద్రమ్మించి, గాలి చల్లగా....! ఊరిచుట్టూ గల పంటచేల నుంచి పైరగాలి....! ఊరికి ఆనించి మూడు దిక్కులా తోటలు...! చింత, సీమ, రాగాల, మునగ, మామిడి, చెట్ల వరుసలు! ఆకుపచ్చని నేల...! నీలాపురం ఊరు!

పొద్దు బంగాళాఖాతానికి అభిముఖంగా, దూరపు కొండల నడుమన యెక్కడో దాక్కొనేవేళ! సూర్యబింబం నుంచి ఆఖరి కిరణాలు, బంగారాన్ని వెదజల్లితే – తమ రెక్కల మీద చూస్తూ, మురిసిపోతూ, ముక్కుల్తో వెలుగు కిరణాల్ని ముద్దులాడుతున్నాయి పక్షులు! భావనపాడు సముద్ర రేవు మీదుగా వీచే గాలి, గిలిగింతలు పెడితే – పక్షులు వాలిన చెట్లకొమ్మలు, కింద మీదులయి ఊగసాగేయి. కాకరాపల్లి తంపర నీటిలో కడుపు నిండా చేపల్ని వేటాడి; ముక్కుల్లోను, గొంతుల్లోనూ మరికొన్ని చేపల్ని గూళ్ళోలోని పిల్ల పక్షుల కోసం కరుచుకుపట్టుకొని... ఎర్ర సెంగవ్వలు, చింకు బాతులు, గువ్వలు, కొంగలు, వడ్రంగి పిట్టలు ఫెలికాన్ పక్షులూ – గుంపులుగా రెక్కలాడించుకు యెగుర్తూ, ఆకాశంలో పలురకాల వరుసల్లో కన్పిస్తూ, ఊరివేపు వస్తున్నాయి.

రేవుగాలీ, కొమ్మల ఉయ్యాలాటలూ, పక్షుల వర్ణ పతాకాలూ, ఇళ్లకు చేరే పశుల మందలూ, పశుల కాపరుల పద్యాల రాగాలూ... ఒక కార్తీక సంబర దృశ్యం!

"... మనకి అన్యాయం జేసినోళ్లకి - పుట్ట గతులుండవు. మట్టిగొట్టుకుపోతారు. మన ఉసురొట్టినే పోదు. ఉన్నవాళ్లు ఉన్నట్టుగ - భూకంపమొచ్చి భూమిల కలిసిపోతారు...." ఆకాశంలో గిరికీలు కొడుతూ, కింద (బీల) తంపర భూముల్లో కానరాని చేపలను వెదుకుతూ, శాపనార్థాలు పెడుతోంది, ఓ ఫెలికాన్ పక్షి! అది కాస్తా గయ్యాలి, మిగిలిన పక్షుల్లో! అంత దూరం నుండి, వేల మైళ్లు ఎగుర్తూ వొస్తున్నపుడు - ఒక గాలి రవ్వ యెక్కువవటమో, తక్కువవడమో; ఒక వాన కురవడమో, మెరుపు మెరవడమో, ఉరుము ఉరమడమో జరగదా? ఆ మాత్రానికే - గాలిదేవుడికీ, వానదేవుడికీ, తెలిసిన దేవుళ్లందరికీ శాపనార్థాలెడుతుంది. కురిసి కురిసి - కొసకి నీటిచుక్కలేక, వీచి వీచి ఆఖరికొక రివ్వగాలి పిసరలేక, ఉరిమురిమి - మళ్లా నోరిప్పలేక గొంతు నాళాలు బిగుసుకుపోయి - పోతార్రా, పోతారు! అధికారాలున్నాయని, అయిశ్వర్యాలున్నాయని, దేవుళ్లమని, మీరేటి చేసినా చెల్లిపోతాదనుకోకండి. మీ అధికారాలు కలకాలం మీకే వుండిపోవు. మీ అయిశ్వర్యాలు యెన్నాళ్లో మిగిలిపోవు, అధికారాలు పోగానే ఆరిపోతాయి. మీరేమి దేవుళ్లు - మిమ్మల్ని మించిన దేవుళ్లు వొస్తారు. మీరు మట్టిగొట్టుకు పోతారని, దోవకడల్లా దూషించుకుంటూ, యెగురుతుంది.

ఆ ఆడపక్షి వేపు నిష్ఠూరంగా చూస్తూ, యెగురుతోన్న దిశను గమనిస్తూ -

".... పిల్లి శాపాలకి ఉట్టి తెగిపడదే, గయ్యాలి ముండా. ఎప్పుడూ, యెవుర్నో వొకర్ని ఆడిపోసుకుంటావేమే జెప్టా! అదృష్టముండాల - యెవురికైనా..." అనన్నాడు, వేదాంతి కంఠస్వరంతో మగ ఫెలికాన్ పక్షిగాడు.

".... యేటీ? య్యేటీ? ఆ మేడలూ, మిద్దెలూ, కార్లూ, కంపెనీలూ కలిగిన నంజికొడుక్కి అదృష్టం రాసిపెట్టేసుందా? మన ఉసురుబోసుకొని, అనుభవించమని ఆడికీ, ఉసూరుమని యేడిసి సవ్వమని మనకీ - విధిరాత రాసేసి వున్నాదా? రాతని సదివేసి, వొంటినిండా వేదాంతం అంటుకుపోయి, అలాగ తళ, త్తళా అందుకేనేటి మెరిసిపోతన్నావు? ఓహోహో, స్వామివారు... యేమి వెలిగిపోతన్నారు! మరలాటపుడు, అదృష్టం బాగుంటే ఆహారం దొరకతాది, లేకపోతే లేదని - గూడు కాడ వుండి పోలేకపోనావా? ఉండ్రా - మీకు కడుపుల్నిండా ఆహారం పట్టుకొస్తానని పిల్లల దగ్గర యేల గొప్పలకి బోనావు? కడుపు నిండినోడు వేదాంతం మాటాడాల్రా, కడుపు ఎండినోడు కాదు! ముండ్రాల గండడికి - యిన్ని దేశాలు దాటొచ్చినా, ఇంకా బతుకు తోవ తెల్దు!" త్ఫూత్!! అనబోయి, నోటిలోని ఒకటి రెండు చేపపిల్లలూ రాలిపోతాయని భయపడి త్ఫూత్ అనకండా, నోరు బిగించి, యీసడింపుగా, మగపక్షిని చూసి, రివ్వున కిందకి దూసుకుపోయి, బీలనీటిలోని తుంగదుబ్బులో బిల బిల మంటూ కదలాడిన నాలుగు పిత్తపరిగల్ని చటుక్కున నోట

కరచుకుని, మళ్లీ రయ్యిన మీదకెగిరి, కాకరాపల్లి మీదగా నీలాపురం చేరి, కంచరాన విశ్వనాథం పెరటిలోని, చింతచెట్టు మీది, తన గూటిని చేరుకుంది.

మగపక్షి – ఆకాశం వేపూ, భూమి వేపూ మళ్లీ మరోమారు చూసింది. అక్కడకు, ఎడమ రెక్క వేపు కొద్ది దూరాన – బీలభూమిలో మట్టిని పోస్తూ, తిరుగాడే లారీలూ, ట్రక్కర్లూ భూమ్మీదా; దుమ్మూ ధూళి మేఘాలు ఆకాశమ్మీదా కన్పించేయి.

మొత్తం బీల భూమి, భూమంతట్నీ – మట్టితోటి కప్పిబెట్టి, అక్కడొక పెద్ద పవర్ ప్రొజెక్ట్ కడతారట. లారీలూ, ట్రక్కర్లూ, మిల్లులూ, మిషన్లూ – యేవేవో యంత్రాలు తిరగతాయట. ఎక్కడిదో బొగ్గుని – ఇక్కడికి తెచ్చి, దాంతోటి కరెంటు ఉత్పత్తి జేస్తారట! కనుచూపు మేరకి లోపున వుండిన, సముద్రంల – ఫేక్టరీ వొదిలిన మలినం (వ్యర్థ పదార్థాలు) సంవుద్రంలో కలుపుతారట. అలాగైతే, అక్కడ సంవుద్రంలోన సేపలు యింకా లోపలికి, నడిమధ్య కెళిపోయి, మనకి దొరకవు! ఇక్కడ బీలభూంవి పోతాది గదా? దొరికే యీ చేప పిల్లలూ యిక దొరకవు! ప్చ్....!

నిట్టూర్చింది, మగపక్షి.

అయినా, మన మేటి సెయ్యగలం? చేతగాని పక్షులం. మనుషులే యేదేనా చెయ్యాల. పంటభూములు పోతాయి, ఇల్లూ, పొల్లూ, దుమ్మూ, ధూళీ గొట్టుకుపోతాయి. పచ్చని చెట్టు మిగల్దు. పక్షుల్లాగ వలసబోవాల! పాపం! మానవులేటి జేస్తారో...?

అంతలో నిర్మాణం కాబోయే కర్మాగారపు – యంత్రాలేవో పెను శబ్దం చేసాయి. తుళ్లి పడింది పక్షి! నోటిలోని రెండు చేపపిల్లలూ, నేల రాలిపోయేయి. ఒట్టి రెక్కల్తో, గూటికి చేరింది, భయం నిండిన పిట్ట గుండెతో!!

× × ×

గడపలో కూర్చొని, పొలంలో పెట్టేందుకు గడ్డితో, దిష్టిబొమ్మ చేస్తున్నాడు కంచరాన విశ్వనాథం. మగపక్షి గూటికి చేరేసరికి; విశ్వనాథంతో మాటామంతిలో వుంది, ఆడపక్షి. పిల్ల పక్షులు, తల్లి తెచ్చిన ఆహారాన్ని, రకరకాలుగా గారాబాలు పోతూ ఆరగిస్తున్నాయి.

“.... దిక్కులేని పక్షులైపోతారు, మీరంతా....!” అనంది ఆడపక్షి. ఒప్పుకున్నాడు విశ్వనాథం.

“.... మీకు కావలసినవి, మీరడుగొచ్చు కదా?” ప్రశ్నించింది, ఆడపక్షి. అర్థంగాక, అదోలా చూసేడు. దిష్టిబొమ్మ సగానికి తయారయ్యింది.

“.... వరి పంట పండిస్తారు. దానికి సరయిన ధర, ధర వొచ్చేదాక నిలవజెయ్యడంకి గొడాంలు అడగొచ్చు. గోగు పండిస్తారు, దానికి జూట్ మిల్లు పెట్టమనొచ్చు. చెరుకు పండిస్తారు, దానికి పంచదార మిల్లులు పెట్టమనొచ్చు. ఆ మిల్లు, మిమ్మల్ని పీల్చి పిప్పి జేసీకుండా, నమిలి మింగేకుండా – మీకే మిల్లులు మీద అధికారం యిమ్మని అడగొచ్చు. ఇవేవే గాకండా, మీకు అక్కరలేనివీ, అక్కరకు రానివీ – యేవేవో కర్మాగారా లెడితే –

అడ్డు తగలరేం...?" ముక్కుపుటాలు బిగించి, గొంతు బిగించి, కంఠసించుకొని అడిగింది, ఆడపక్షి.

విశ్వనాథం, దిష్టిబొమ్మ పని ఆపి, ఆ పక్షివేపు ఓసారి చూసి –

".... యీ నంజి కూతురు, దేశదేశాలు తిరిగి, యిలాగే జెనాల్ని రెచ్చగొట్టేసి, విప్లవాలు లేపుతంది గావాల? ఏ దేశమోడో, దీని మీద కుట్రకేసు బెడితే తప్పేటి? నంజి కూతుర్ని పిట్టని కాల్సినట్టు కాల్సిత్తే – పాపమేటి? గవర్నమెంట్లు అన్నాక; గవర్నమెంట్లని మించిన ఘనాపాటీవోళ్లు (కంపినీలవోళ్లు కావచ్చు) అన్నాక – అభివృద్ధి పన్లుకి పూనుకోకుండా, వొల్లకుంతారా? వొల్లకుందామనుకున్నా, వుండనీయవు, అధికారాలూ, ఆ సంపదలూ! మరలాంటపుడు, గవర్నమెంటుకి అడ్డు తగలొచ్చా? అభివృద్ధిని అడ్డేవొచ్చా!

ఒలేయ్, నువ్వే కాదే; యిక్కడ చెల్లని కాణీల కమేనిస్టు లీడర్లూ, తెగిపోయిన టిక్కట్లలాంటి అపోజిషన్ పార్టీల లీడర్లూ, ఆళ్లూ యీళ్లూ – యిదే మాట, నీలాగే అంటర్ను! అదిగో ఆ ఫేక్టరీకి అడ్డు తగుల్దు మంటిర్ను. ఆళ్ల మాటే గాని యినీసి దిగిపోయినామా రంగభూమిలోకి – యుద్ధం మధ్యల వొదిలేసి జారుకుంతారు, మేము అభిమన్యులమయిపోతాం! నువ్వయితే – పరదేశం యెగిరి పోతావు! మా చావులు కోరతావే ముండా – నీకు నాలుగు చేపపిల్లలు దొరకవని? ఇక్కడ గాకపోతే – యింకొక్కాడకి పోయే పిట్టముండా...." యిలాగ, మనసులో చాలా ఆవేశంగా, ఆ పక్షి మీద గుణుసుకున్నాడు, కానీ పైకి, వొక్క పలుకు గూడా పలకలేదు.

గానీ, ఆ పక్షి ముండ –

".... అందుకే, నీ పెళ్లాం అడ్డమయిన తిట్లూ తిడ్తాది నిన్ను. నీ మనసులోన యేటనుకున్నావో, నేనూహించగల్ను..." అనంది.

".... నీకసలు తెల్దుగావాల? నా పెళ్లాం, అపుడపుడు సిదగ గొడతాది నన్ను. నాకసలు సాలికే రావు, ఆ దెబ్బలు! తిట్లయితే – అసలకి యినబడవు. ఒకేళ, యినబడితే, దీవనల్లాగ. బేపనోడి వేదమంత్రాల్లాగ, యెంత హాయిగా వుంతాయో!" తన్మయంగా కళ్లు మూసి, హాయిగా నవ్వేడు విశ్వనాథం.

"....ఛీ... సిగ్గులేని మొగానికి, నవ్వే సింగారం..." అని చీదరించింది, ఆడపక్షి.

గూటిలోని మగపక్షి భయపడింది. అనవసరంగా, తగవు పెట్టుకుంటోంది. ఉన్నపళాన, చెట్టు కొమ్మ మీది గూటిని ఖాళీ జేసి, పొమ్మంటాడేటో? పిల్లల్తోటి – యెందులో పడిపోతాం, యీ పొద్దు గుంకే వేళ?

గయ్యాళిముండ – మొగుడ్ని తిట్టినటుట్టి, పరాయోడ్నీ తిట్టేస్తంది! ఏటి జెయ్యిడిం? దీని, నోటిల నోరుపెట్టలేం – అని నానా విధాల వగస్తోన్నాడు, మగపక్షిగాడు. విశ్వనాథాన్ని ప్రాధేయపడాలి; అనుకొని –

"....బావూ, యిశ్వనాతం, యేటనుకోకు. ఇది గయ్యాళి గంప! దీని నోరు మంచిది

కాదు, నా మొకం చూసి, మన్నించు...." అని బతిమాలేడు మగపక్షిగాడు.

విశ్వనాథంకి ఊపిరొచ్చింది. దిష్టిబొమ్మని, ఒక పక్క పడేస్తూ, ఊపిరి బిగించి, ఒళ్లంతా పూనించి ".... ఔను గానీ, యేటి జూసి నీ పెళ్లంకి ఆ గీర్వానం? పెద్దా చిన్నా, మనిసీ, మానూ – అని చూడదేటి? నీ మొకంవూ, నీ పిల్లల మొహాలూ చూసి, వొల్లకుంటన్నాను. లేపోతే–గూడు ఖాళీ జేయించి తగిలీద్దును, ముండకి...." అనన్నాడు.

"....అం! యిదొక యేడంతస్తుల మేడ! తగిలేస్తే – మరెక్కడ దొరకదు! నోరుముయ్యివోయ్ – నోటిల యేరిగీ గల్ను. నువ్వు తగిలిస్తే – సెట్లే కరువా? ఊరంతా చెట్లే! ఓయ్ చెట్లు గాదు – తిన్నగెల్లి, ఆ కరెంటు మిల్లోడి (పవర్ ప్రాజెక్టు) బిల్డింగు మీద గూడు గట్టగల్ను. ఆం! ఇలాంటి బెదిరింపులు నాగ్గాదు యిదిగో, నీలాటోడు, యితగాడ్ని బెదిరించు..." అని మొగపక్షిని చూపింది.

కోపంతో, లేవబోయేడు విశ్వనాథం. గానీ, సరిగ్గా ఆ సమయానికి, భార్య రేవతమ్మ వొచ్చింది. ఆమె యేమి చూసిందో మరి? పక్షుల వేపూ, వీధి వేపూ చూస్తూ –

".... ఆ కళ్లు చూడు, రంకు కళ్లు! ఆ కళ్లల్ల జిల్లేడు పాలుబొయ్య. రా, యిటుకేసి, రా, సెప్తాను..." అని మొటిమలు విరిచింది.

ఆ వీధిలోకి రాబోతోన్న నీలాపు ఆకాశ్ అడుగులు ఆగిపోయేయి. అక్కడే నిల్చొని, ఇళ్లకప్పుల మీది పక్షుల్నీ, ఇళ్ల చుట్టూ గల చెట్ల కొమ్మల మీది పక్షుల గూళ్లనూ అలా చూస్తూ వుండిపోయేడు. నారింజపండు రంగు ముక్కుల్తో, ఎర్రటి పొడవాటి కాళ్లతో, ముదురు ఎరుపు తలల్తో తెల్లటి శరీరమ్మీద నలుపూ, గులాబి రంగు చారల్తో, గులాబి రంగు తోకలతో – చూడముచ్చటగా వున్నాయి, ఫెలికాన్, స్టార్క్ మొదలైన పక్షులు!

పెరటిగోడ మీదుగా వీధిలోకి చూస్తోన్న భావనాకు ఆకాశ్ కన్పించేడు. తల్లి తిట్లదండకం విన్పించింది. మళ్లీ వీధిలోకి చూస్తే – వెనుదిరిగిన ఆకాశ్ కన్పించగా, కిసుక్కున నవ్వుకుంది. నెమ్మదిగా ఇంటి ముందు వేపు నుంచి, బయటికి నడిచింది.

రేవతమ్మ – యింకా పిట్టపేరు పెట్టి తిడుతూనే వుంది. దిష్టిబొమ్మ తయారీలో వున్న విశ్వనాథం, ఆమెవేపు చూస్తూ –

"......మునిమాపు వేళ కాకిలాగ అరస్తన్నావు, ఎవులి మీదనే?" అని, యిగట (హాస్య) మాడబోయేడు.

".... ఔను, నేను కాకిని. నువ్వేమో, అదిగో, ఆ కొమ్మ మీది పంచరంగుల పరదేశపు పక్షిరాజువి...!" అనంది రేవతమ్మ.

"..... యిన్నాళ్లకి సత్యం పలికినావే...." అని నవ్వుతూ, చేసిన దిష్టిబొమ్మను, గడపమూల పెట్టాడు విశ్వనాథం.

".... పక్షిరాజా – గూటిలోని పక్షి యెగిరిపోకండా సూస్కో మారాజా! ఆ తర్వాత పరువూ, మర్యాదలు యీధిపాలు కాగలవు...." హెచ్చరించింది, రేవతమ్మ.

"…. యేటే, నీ గోస? పక్షి రాజునంతావు, మరొకపక్క పక్షుల్ని కాపలా కాయమంతావు. ఫారెస్ట్ వాచ్‌మేన్ దాలప్పడి నౌకరీ గాని, తీస్సావా? యేటి? నీకు ఫవర్సు వుంతే – ఎవులికేనా నౌకరీ వుంచుతావా? అందరి నౌకరీలు పీకీసి, దిక్కులేని పక్షుల్ని జేసీవా?" అని బదులిచ్చేడు భర్త.

చెట్టు కొమ్మ మీది ఆడపక్షి, యీ మాటల్ని విని, కీఁ కీఁ…. అని నవ్వింది. ఆ నవ్వు విన్న విశ్వనాథం, చెట్టు మీదకు చూస్తూ, ఆ పక్షితో – ఎందుకే నవ్వతావు? నీ నవ్వు గాని నా పెళ్లానికి బోధపడితే, నాకీ పూట తిండెట్టదు. నువ్వు యిటు చూడకు, మా మాటలు యినకు. అఁ – అన్నట్టుగా కళ్లతోనే హెచ్చరించాడు. విశ్వనాథానికి, పక్షుల్తో మాటాడటం, వాటిని లాలించటం, వాటికి యెక్కడో వేటాడి చేపపిల్లల్ని తెచ్చి తినిపించటం, దేశదేశాల భోగట్టాలు పక్షుల్ని అడిగి తెలుసుకోవడం పరిపాటి!

రేవతమ్మ, భర్త సైగల్ని గమనించలేదు. తన ధోరణిలో, తను –

"….అఁ! అదిగో భావనపాడు హార్బర్ కట్టడం జరగడమూ; నాకు పవర్సూ, నీకు యింటి గురించిన యింగితం రావడమూ – యీ జన్మలో జరగవు…." అనంది, నిట్టూరుస్తూ.

విశ్వనాథం – యిక మౌనం వహించడం మంచిదనుకున్నాడు. ఏదో పెద్ద సమస్యనే, తన ముందు పెట్టబోతోందని అనుమానించాడు. ఇక, యిక్కడితో భార్యతో సంభాషణను ఆపివేయడం ఆరోగ్యకరం అని భావించి, చెట్లమీది పక్షుల వేపు చూడసాగేడు.

పొద్దు పడమరన ఆఖరిచూపులో వుంది. కొమ్మమీది, ఫెలికాన్ పక్షులు కికక్కక్… అని అరుస్తున్నాయి! కొమ్మలు మీంచి గూళ్లల్లోకీ, గూళ్ల నుంచి కొమ్మల మీదకీ ఎగురుతూ, వొకదాన్నొకటి రెక్కల్తో పలుకరించుకుంటూ, కేరింతలు కొట్టసాగేయి!

"… జల్మంటే – మీదే! బెంగా, బెదుర్లేదు. అదుపూ, ఆజ్ఞల్లేవు. ఎక్కడ్నిండో వొచ్చేరు. ఇక్కడ వాలినారు. ఇక్కడి కొమ్మారెమ్మలు; చెట్టూ చేమలు; చెరువులూ, తంపరలూ అన్నీ మీవే! గూళ్లు గడతారు. కాపరాలు చేస్తారు. పిల్లా పిచ్చుకల్ని కంటారు. ఊరి జనాలందర్ని మచ్చికజేసి మసలుకుంటారు. మళ్లా, మరేమి అనుకుంటారో – యిన్నింటినీ వొదిలేసి, యెక్కడి నిండి వొచ్చేరో అక్కడికి యెగిరిపోతారు. మీదీ జల్మంటే!!" అని పలికేడు, పక్షుల్ని చూస్తూ.

ఆ పక్షులు – యెక్కడో సైబీరియా ప్రాంతపు మెద్వెజ్ దీవుల నుండి వస్తాయట. ధృవప్రాంతానికి దగ్గరుండటం వలన, సెప్టెంబర్ నెల నుంచి ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీకి పడిపోయి, మంచు ముద్దలవుతాయట దీవులు. అంచేత, ఆ వాతావరణం తట్టుకోలేక, మంచుముద్దల వలన ఆహార సేకరణ సాధ్యంగాక, యీ పక్షులు అక్కడ్నించి జట్లు, జట్లుగా – ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మీదుగా, హిమాలయాలను దాటుకుంటూ, రాజస్థాన్, కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాలకు చేరుతుంటాయట. ఇక్కడినుంచి, మళ్లీ వాతావరణం భరించశక్యం గాని వేసవిలో, ఏప్రిల్ ప్రాంతాన తిరిగి మళ్లీ, ఆ దీవులకు వెళిపోతాయి.

పక్షుల జన్మ ఘనత గురించి మాటాడిన భర్తను చూస్తూ –

"…. నీ జల్మకి మాత్రం యిపుడేటిలోటు మారాజా? పొద్దుట లెగుస్తావు. పశివిల ఉసురుదీస్తావు! పండించిన పంట తక్కువా, ఆపసోపా లెక్కువా!

పోనీ, అంత సరదాగా వుంతే – యే బాదరబంధీ లేకుండా యెగరాలని వుంతే; అదిగో, పెళ్లికి యెదిగొచ్చిన ఆడకూతురున్నాది. దానికి మనువు చేసీసి – మా రాజా… యిల్లూ, పొల్లూ, యిల్లాల్నీ వొదిలేసి యెగిరిపో! ఎవుళడ్డుతారు…?" అని, అనుజ్ఞ యిచ్చింది.

అదరా! అసలు సమస్య, కూతురిపెళ్లి అన్నమాట! ఇది మళ్లీ, సమస్యని ముదేస్తందన్నమాట – అనుకుని, మౌనం వహించాడు విశ్వనాథం! మౌనంగా – ఆలోచనలో పడ్డాడు.

నిజానికి విశ్వనాథం కూతురుకి ఊరిలోనే ఒక సంబంధం వచ్చింది. బెండి జగన్నాయకులు రెండో కొడుకు సుందరేశంకి తన కూతుర్ని అడగటానికి వచ్చేరు. పెళ్లి చూపులు జరిగేయి. జగన్నాయకులుకి యిద్దరు కొడుకులు. పెద్ద కొడుక్కి టెక్కలి దగ్గరి పెదసాన గ్రామస్థుడు కోత భాస్కర్రావు కూతుర్ని చేసేరు. వాళ్లు, ఆడపిల్ల ఆస్థి కింద ఎకరా భూమి రాసేరు. బంగారం, గింగారం, కట్న కానుకలు గూడా యిచ్చేరట. ఈ విషయాలన్నీ, పెళ్లిచూపులపుడు, ఒకాయన చెప్పుకొచ్చేడు. అప్పుడే, విశ్వనాథం గుండెల్లో రాయి పడింది. తనకున్నది ఒక్కగానొక్క కూతురే. గానీ, తన ఆస్థి గూడా ఒక ఎకరా భూమీ, యిల్లూ, కళ్లం! భార్యాభర్తలిద్దరూ స్వంత భూమిలో కష్టపడటమేగాక, కూలీనాలికి గూడా వెళ్లి, బతుకు బండిని లాక్కొస్తున్నారు. కట్న కానుకల కింద ఉన్న భూమీ, యిల్లూ పోతే – బతకడమెలా?

"…. మనమెలాగోలాగ బతికేస్తాం. అయినా, ఎన్నాళ్లు బతికేస్తాం? బతికినన్నాళ్లు – యింకా బతికీంగదా? గుండెల మీద కుంపటిలాటిది ఆడపిల్ల. దాన్ని దించుకోవాల. అదీగాక – ఊర్లోని సమ్మందం. పిల్ల – కళ్లముందుంటాది. కష్టం, సుకం సూడగలం. ఖాయం జేసిద్దుం, యీ సమ్మందాన్ని…." అనంది భార్య.

ఔనన్లేదూ, కాదన్లేదు. ఈ యేడాదికి తూగలేం – అన్నాడు. సరే – మీరెప్పుడు తూగితే, అప్పుడే పెళ్లికి ముహూర్తాలు పెట్టుకుందాం అన్నారు వాళ్లు! అలా, కిందటి యేడాది ఆగింది.

"…. యేటి ఆలోచించావ్?" ప్రశ్నించింది భార్య.

"….. కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా – ఆగవు! రానీయి, ఆ ఘడియలు…."

"… నువ్వు ఘడియలు కోసరం సూస్తుండు! అది, సమయం చూసి, గడప దాటేస్తాది…"

"…. సే. నా కూతరలాటిదాయి కాదు…."

"… రోజులెలాటివి? వొచ్చే సిన్మాలెలాటివి? నేర్పుతున్న బుద్ధులెలాటివి?"

విశ్వనాథం, మరి బదులు చెప్పలేక, మౌనం వహించేడు.

× × ×

సరిగ్గా, ఆ సమయానికి ఆ ఊరి తోటల్లో కార్తీకమాసపు వన మహోత్సవానికి వొచ్చిన బృందాలు, తిరుగు ప్రయాణమవుతున్నాయి. అప్పటిదాకా, ఆటలూ, పాటలూ; చెట్ల కొమ్మల మీది ఫెలికాన్ పక్షుల్తో కేరింతలూ, సందడి సందడి తోటలన్నీ – మౌనంలోకి వెళ్లబోతున్నాయి. ఇంకా, యింకా కాసేపు, ఆ విదేశీ పక్షుల్తో గడపాలనుకుని మొరాయించే పిల్లలను – వారి పెద్దలు, మరోసారి మళ్లీ వస్తాంగా – అని నచ్చచెప్పి, లాలించి, తీసుకెళ్తున్నారు.

ఓ తోటలో, ఓ గున్నమామిడి చెట్టు వద్ద ఆకాశ్–భావనా కోసం యెదురు చూస్తున్నాడు. మామిడి చెట్టుకెదురుగా సీమచింతచెట్టుంది. దాని కొమ్మకు – రెండు పక్షులు గూడుకట్టే పనిలో వున్నాయి. పొడవాటి ముక్కుతో, పచ్చివీ, ఎండినవీ కర్రపుల్లల్ని ఆడపక్షి తెచ్చి అందిస్తే, మగపక్షి ఆ పుల్లల్ని జడమాదిరి అల్లికజేసి, చిక్కగా గూడు అల్లుతోంది.

ఆ గూడు చూసి – నిట్టూర్చేడు ఆకాశ్.

అప్పుడొచ్చింది భావనా.

"... రావేటో, అనుకున్నా...." అన్నాడు ఆకాశ్.

".... రాగూడదనే అనుకున్నాను....."

".... మరి, మానెయ్ లేపోయేవా?"

"... మా అమ్మ తిట్లు తింటన్నావు గదా, పాపం! పోనీ వొకసారి కనిపించీసి వొచ్చీస్తే, తప్పేటి? అనుకొనొచ్చేను...."

"... అంతేగాని, నా మీద ప్రేమలేదన్నమాట?"

"... ప్రేమంటే...?" ప్రశ్నించింది భావన.

ఆకాశ్, సమాధానం వెదకసాగేడు. ఏవో సిన్మాదృశ్యాలే గుర్తొస్తున్నాయి. అవి సమాధానాలు కాబోవు – అని అన్పిస్తోంది! మరేంటి...?

"... అదంటే, యేటో, అది వుంటే యేటవతాదో యెవుళ్లో సదువుకున్నోళు, సిల్మా సరదాలవాళ్లకీ తెలస్తాదేటో గాని – నాకు తెల్దు! నీకూ తెల్సినట్ల లేదు..." యింకేమో చెప్పబోయింది భావన.

".... పోని ప్రేమ కాదు – ఇష్టమో...?" అడ్డుతగిలేడు ఆకాశ్.

".... ఇష్టమైనవన్నీ – అయిపోతాయేటి?" ఆకాశ్‌కి మళ్లీ సమాధానం దొరకలేదు. ఈమె కలవక, కలవక, యెపుడో కలిస్తే – యిలాంటి ప్రశ్నలే సందిస్తాదేట్రా బాబూ! సమాధానం నాకు దొరకదూ, తను చెప్పదూ – యిదేట్రా బాబూ – అన్నట్టు మొహం పెట్టేడు.

"... మా అమ్మ సూస్తాది నా కోసం. పెరట్లో వున్నదాయి యింట్లోకి గాని వొచ్చిందా

– నా పనయిపోద్ది. వస్తాను....” అని, తుర్రుమంది భావన.

ఆకాశ్, ఓ క్షణం యేంచెయ్యాలో బోధపడక నిల్చున్నాడు.

× × ×

దిష్టిబొమ్మ తయారీ అయ్యేక, దాన్ని తీసుకొని, ఇంటి మునివాకిటి గడపలో ఒక మూలపెట్టి, గడపలో నిల్చున్న విశ్వనాథానికి– ఒకటి చిన్న పక్షిపిల్ల, కుంటుతూ కన్పించింది. చెట్టు కొమ్మ మీది గూటికి యెగరలేకపోతోంది. గూటిలో తల్లి పక్షి గాని, తండ్రి పక్షి గాని – యీ పిల్లపక్షిని పట్టించుకోవటం లేదు.

“.... ఈ పక్షుల గుణం యేటో బోధపడదు. ఏ దేశం నుండో యిక్కడికొస్తాయి. కాపరాలు చేస్తాయి. పిల్లల్ని కనీ, పెంచుతాయి. గూటిలోన సంరక్షణ చేస్తాయి. గూడు లోంచి జారి, కిందబడితే మాత్రం – మరి పట్టించుకోవు. ఒదిలేస్తాయి! ఏటో, యీటి తత్త్వం....” అని, తనలో తాను గొణుక్కుంటూ, ఆ పక్షి పిల్లను పట్టుకొని, సపర్యలు చేయసాగేడు. అప్పుడే యింటికి వొచ్చిన భావనాకు, ఆ పక్షిపిల్లను చూపి –

“.... సూడమ్మీ. పిల్లముండ, గూటిలోంచి జారిపడి పోయింది. పాపం, సూడు, యెలాగ యేడస్తందో....” అనన్నాడు.

ఆ పక్షి పిల్ల లేతగా వుంది. నలుపూ, తెలుపు రెక్కలే! అది బహుశా పుట్టి రెండు మాసాలై వుంటుంది. అయిదు నెలలయితేగానీ రెక్కలు పంచవర్ణానికి మారవు. శరీర దారుఢ్యం గూడా – యెగరటానికి తగ్గ యేర్పడదు. సమర్థంగా యెగురలేని పక్షుల్ని విడిచి వెళిపోతాయే తప్పా – తమ తిరుగు ప్రయాణానికి, ఆటంకం రానీవట ఆ పక్షులు!

“.... అందుకే, యెగరలేని పక్షిపిల్లలు గూళ్లు నించి జారి పడిపోకండా – చెట్ల మధ్య వలలు కట్టండి మహాప్రభువుల్లారా, అనడిగేం. ఏ ప్రభువూ, పక్షుల్ని సందర్శించడమే తప్పా – సంరక్షణ వూసెత్తడు...” విచారంగా పలికేడు విశ్వనాథం.

ఆ గ్రామం, ఆ పరిసర ప్రాంతాలూ – సందర్శన కేంద్రాలైనాయి గానీ, అందుకు తగ్గ సదుపాయాలనేవి యేర్పాటు కాలేదు. గ్రామస్థుల విన్నపాలకు మోక్షం కలగడం లేదు.

అప్పుడే, పెరటిలో పనులు పూర్తి చేసుకొని, మునివాకిట గడపకొచ్చిన రేవతమ్మ, భర్తను చూస్తూ –

“.... ఆ పక్షి పిల్లని పెంచుకో. పైసా ఖర్చు పెట్టక్కర్లేదు. కూతుర్ని, మాత్రం గాలికి వొదిలీ...” అని నిష్ఠూరంగా పలికింది.

“.... పిచ్చిమాలోకమా, పెంచేదీ, తుంచేదీ మన చేతుల్ల వుండదే. అంతా భగవంతుడి లీల..... మనం నిమిత్తమాత్రులం.....” అని వేదాంతాన్ని రక్షణగా తెచ్చుకున్నాడు విశ్వనాథం.

సీమచింతచెట్టు మీది, ఫెలికాన్ పక్షులు, యీ యిద్దరి సంభాషణనూ, ఆసక్తిగా వింటున్నాయి.

“... నీ జిమ్మబడా, కవుర్లు సెపతావు యేదాంతం కవుర్లు. గండడా – గాలిల

దీపం బెట్టి, దేవుడా నీదే పూసీ అనంటే, ఆరిపోకుండా వుంతాదా? నీ చేతులు అడుపెట్టవురా, పనికిమాలినోడా? ఆ చేతులు, దేవుడెందుకిచ్చినాడ్రా?" రేవతమ్మ, రేగిపోయి భర్తని దులిపేసింది. తను పెరటిలోంచి ఇంట్లోకొచ్చేసరికి – కూతురు యెటో వెళ్లి వొచ్చినట్టుందన్న అనుమానం వొక ప్రక్క; భర్త వేదాంతం మరోప్రక్క ఆమెలో ఆగ్రహాన్ని పెంచేయి.

చెట్టుమీది ఆడపక్షి – కకక్క్ కకక్క్ మంటూ నవ్వసాగింది. విశ్వనాథానికి ఒళ్లు మండింది గానీ, పెళ్ళాం ముందు, పక్షుల్తో కబుర్లాడితే అసలే కోపమ్మీదుంది, మీదబడి కరిసీసినా కరిసేస్తాది, దండుముండ – అని, భయపడి, మిన్నకుండిపోయేడు.

"... ఎంతయినా, మీ ఆడజాతికి నోరు పెద్దది. ఆ నోరు పెట్టుకొనే బతికేస్తారు...." మగపక్షి కామెంట్ జేసింది.

విశ్వనాథం – కూతుర్నీ, పక్షిపిల్లనూ చూస్తూ వుండిపోయేడు. పక్షిపిల్ల – కూఁ కూఁ.... అని దీనంగా యేడుస్తోంది. రేవతమ్మ, అదేమీ పట్టించుకోకుండా, కూతురి వేపు కోపంగా చూస్తూ

"... యేంవే? ఎక్కడికెళ్లేవే? ఏటే నీ ఉద్దేశం? ఇంటి పరువూ మర్యాదలూ యేటిల కలిపేస్తావేటే? అదిగో – గూటిలోంచి జారిన ఆ పిల్లపక్షిని చూడు! అలాగయిపోగలవు..." అని హెచ్చరించింది.

భావనాకు, ఆ మాటతో ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. గబగబా గడపలో ఒక మూలకు వెళిపోయి, యేడ్వసాగింది. విశ్వనాథానికేమీ పాలుబోలేదు. దేన్నయినా భరించగలడు గానీ, యేడుపుని భరించలేడు! గాయపడి యేడ్చే వాళ్లను చూస్తే మరీ బాధపడ్తాడు.

భార్యవేపు చూసేడు. ఆమె గూడా అంతవరకూ, అంత కరకుగా మాట్లాడిన మనిషీ – కూతురు కూలబడి యేడుస్తోంటే చూసి కరిగిపోయింది. అపరాధ భావంతో – అలా మౌనంగా గడపలో చతికిలబడి పోయింది.

అప్పటికి, వెలుగుని మింగేసి, చీకటి నిండింది. చెట్ల మీద పక్షులు గూడా, మౌనం వహించేయి. వాతావరణ మంతా, చీకటిగా నిశ్శబ్దంగా, చలనరహితంగా, యేదో యెరుకగాని ఉపద్రవంతో ఘనీభవించినట్లుగా వుంది!

కాసేపటికి, రేవతమ్మే తేరుకుంది. మనసులో, యేదో దొలుస్తోంది. గానీ, ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. భూమిని మొలకి కట్టుకొని, సొర్గానికి యెళిపోతామా? మనం పోయిన తర్వాతయినా, ఇల్లూ పొల్లూ, భూమీ పుట్టా – కూతురుకే, గదా చెందుతాయి. అయినకాడకి, యివేవో చెల్లుజేసేసి, అపుడే పెల్లి జేసేస్తే యెలాగున్నో? ఈ, మనిసి పూనుకున్నాడు కాదు. తూగలేం అనీసాడు. ఇపుడా? కూతురు ఆలోచనేటో తెల్దు! ఆడెవుడో, ఆకాశ్‌గాడు? ఏ ఊరివోడో? కరంటు ఫేట్రీకి మట్టిలోడు లారీ డ్రైవరట – ఆడు, యీ యింటిసుట్టు తిరగతండు!

ఏటి సేతుం.....? మనసులో ఆలోచనల్లో సతమతమవుతూ - భర్తను యెన్నడూ లేని సౌమ్యస్వరంతో - ఏటి సేతుం? అనడిగింది.

"... అతగానికేటి సేతనవును? శౌర్యం లేని మనిసి. ఏదేనా, నువ్వే నిర్ణయించు.." అని చెప్పింది, ఆడపక్షి.

కానీ, రేవతమ్మకు అది బోధపడలేదు. పక్షుల్తో విశ్వనాథమే మాట్లాడగల్డు. కోపంగా, పక్షివేపు చూసాడు విశ్వనాథం.

".... పోనీ, కూతుర్ని, మన ఊరిలోని ఆ బెండి జగన్నాథం కొడుక్కే యిచ్చి పెళ్లి జేద్దుమంటే - అదిగో ఆ కరెంట్ ఫేక్టరీ కింద కొంత భూమి పోతాదట, మరి కొంత ఆ ఫేక్టరీ వొదిలిన మెులాయిసో యేటో ఆటి వలన పంటలు పండవట. ఎలాగ బతుకుతారు?....." తన లోపలి ప్రశ్నను, భార్యకు వేశాడు.

".... మరి నీ భూమి మాత్రం వుండిపోతాదేటి? మీరెలాగ బతకతారు? అందుకే, అడ్డుకోండిరా - ఆ కంపినీని అనంటన్నాను...." అనంది, ఆడపక్షి.

".... ఒలే, ఆ గవర్నమెంటు కాదు గానీ - నేనే కేసూగీసూ లేకుండా సంపేస్తానే నిన్ను. ఏ దేశపు దానవో గానీ, ఆ దేశానికి నీ శవం గూడా యెల్లదు. నా పెళ్లం వుందని వూరుకుంటే రెచ్చిపోతావేమే? నోర్మూసుకొని గూటిల వుండ..."ని, పక్షుల భాషలో కేకలేసాడు విశ్వనాథం.

ఆ పక్షి, క క క్క క్క క్..... అని నవ్వుతూ, రెక్కల్లోంచి ఒక ఈకను రాల్చింది.

".... అయితే, ఆ లారీడ్రైవరోడికి పిల్లనిద్దామా? ఆడికి, ఒక యిల్లూ పొల్లూ; వెనకాముందూ ఆస్తిపాస్థులేటీ లేవట! ఎలాగ బతుకుతారు....?" రేవతమ్మ!

ప్రశ్న మళ్లీ - బతుకుకాడకే వొచ్చింది. చీకట్లను తొలగిస్తూ - విద్యుత్ దీపాలు వెలిగేయి. గడపలో దీపం వెలుగు రావడంతో, ఒక మూలన యేడుస్తూ కూచున్న భావనా, కళ్లు తుడుచుకొని, లేచి, యింట్లోకి వెళిపోయింది.

".... ఇంతకీ, భావనాను అడిగారా? ఏ అబ్బాయిని యిష్టపడుతోందో....?" అనడిగింది, ఆడపక్షి.

".... దానికేటి తెలుసు, యేది మంచో యేది చెడో...? పెద్దలం మనం ఆలోచించి, దానికి చెప్పాల...." అనన్నాడు విశ్వనాథం.

".... ప్రభుత్వం గూడా అలాగే అనుకుంటుందోయ్. ఏది మంచో, యేది చెడో - మీకు తెల్దని. అందుకనే - మీ మంచి యేదో మీరు చెప్పాల.... అవునువోయ్...." అని, నచ్చజెప్పే స్వరంతో చెప్పింది ఆడపక్షి.

ఎటుదిప్పినా - యీ పక్షిలంజ, ప్రోజెక్టు కాడకే లాగతంది. దీని, మాటలిక యినగూడదు - అని మనసులో నిర్ణయించుకున్నాడు విశ్వనాథం.

నువ్వు వింటావో, మాన్తావో - యిదే ఆఖరుసారి! నీ ఊరు రావటం, నీ యింటికొమ్మ మీద గూడు కట్టుకోవటం, నీతోటి ఊసులాడటం - యిక మరి జరగదు. ఆ పవరు

ప్రోజెక్టు పొగలూ, సెగలూ; అవి వొదిలిన విషాలూ – కడుపారా నింపుకోండి. ఈసారి వెళిపోయి మరి రాము! మళ్లీ నీకు మంచీ, చెడ్డా చెప్పము.... అనుకుంది ఆ పక్షి కూడా మనసులో!

రేవతమ్మ యేమనుకున్నదో, యింట్లోకి చూసి – "... అమ్మీ, భావనా, యిలగ రమ్మీ..." అని పిల్చింది. భావనా, ఉలకలేదు. పలుకలేదు. రానూ లేదు. మళ్లీ పిల్చింది. అప్పుడొచ్చింది భావనా!

".... అమ్మీ. ఇది నీ బతుకు సమస్య. సెప్పు ఏటి సేద్దుం.....?" అనడిగింది.

భావనా – ఆశ్చర్యపోయింది. తను యేం చెప్పగల్దు? ఎవర్ని యిష్టపడుతున్నాను?

ఊరిలో అబ్బాయి, సుందరేశం – రోజూ కన్పిస్తాడు గానీ, మాటాడ్డు. తనకంటే ముందర అతనే సిగ్గుపడ్తాడు. పరాయి ఊరి అబ్బాయి – అపుడపుడూ కనబడ్తాడు. మాటాడ్తాడు గానీ – ఆ మాటలు వింటే యేవో ప్రశ్నలు కలుగుతాయి.

".... చెప్పమ్మా. నీ యిష్టం. ఈ శ్రావణంలోనే పెళ్లి జరిపించేస్తాం...." అనన్నాడు విశ్వనాథం.

".... ఔను మరీ! ఆ పవరు ప్రోజెక్టు పూర్తయితే – పెళ్లి మేళాలు గాదు, చావు మేళాలు మోగుతాయి, యిక ఊళ్లల్ల...." మళ్లీ ఆడపక్షి, చివరి మాటగా పలికి, గూటిలోకి వెళిపోయింది.

భావనా యేదో చెప్పబోయేంతలో – ఆ వీధిలోంచి, ఊరేగింపుగా ప్రజలు – "పవర్‌ప్రోజెక్ట్ వొద్దు – పంటభూములు పాడు చెయ్యొద్దు" వగైరా నినాదాల్తో! భావనా, ఆ ఊరేగింపు వేపు చూడగా – ముందు వరసలో సుందరేశం కన్పించేడు.

ఊరేగింపును చూస్తూ, వీధిలోకి నడిచేడు విశ్వనాథం. రేవతమ్మ, భావనా గూడా వెంట నడవగా – గూళ్లలోని పక్షులూ కలిసేయి!

– × –

(రచనా కాలం ఏప్రిల్–2010 'చినుకు' ప్రత్యేక సంచిక)